జిల్లాలో నేడు

చేవెళ్ల మండలానికి మంత్రి కోమటిరెడ్డి రాక




చేవెళ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు ఈనెల 8వ తేదీన(బుధవారం) రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య రానున్నట్లు ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ముడిమ్యాల్ గేట్ నుంచి రావులపల్లి, వయా వేడిపల్లి మీదుగా పొద్దటూర్ రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ శాఖ నిధులు రూ.24 కోట్లతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఉదయం 11 గంటలకు మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అలాగే చేవెళ్లలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ గోదాం ప్రారంభం ఉంటుందన్నారు.

ప్లాట్ల జాబితా విడుదల

కందుకూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి):ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లకు సంబంధించిన జాబితాను ఈనెల 8న (బుధవారం) విడుదల చేయనున్నట్లు ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం మీర్కాన్‌పేట, ఆకులమైలారం, అన్నోజిగూడ, బేగరికంచ, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి గ్రామ పంచాయతీల్లో ఈ జాబితాను ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వారం రోజుల్లో ఆర్డీవో కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆయన కోరారు.

భూగర్భం.. గరళం



ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాగు, సాగునీటిలో పరిమితికి మించి ఫ్లోరైడ్, రసాయన అవశేషాలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర భూగర్భ జల మండలి(సీజీడబ్ల్యూబీ) తాజాగా విడుదల చేసిన వార్షిక భూగర్భజలాల నాణ్యత నివేదికలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. పలు ప్రాంతాల్లో తాగు, సాగునీరు అంత సురక్షితం కాదని పరీక్షల్లో తేలింది. అనేక మండలాల్లో ఫ్లోరైడ్ విస్తరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అలాగే నీటిలో నత్రజని శాతం పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. దేశంలోనే అత్యధిక నత్రజని (నీటిలో) ఉన్న 16 జిల్లాలను ప్రకటించగా ఇందులో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో ఉన్నట్లు నివేదికలో పేర్కొవడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న ఫ్లోరైడ్ భూతం

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రసాయన అవశేషాలు
- రంగారెడ్డి జిల్లాలో దేశంలోనే అధికంగా నత్రజని
- పరిమితికి మించి రసాయన అవశేషాలు
- వికారాబాద్ జిల్లాలో 100 శాతం సురక్షితం
- కేంద్ర భూగర్భ జలమండలి తాజా నివేదికలో వెల్లడి



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): రంగారెడ్డి జిల్లాలో 70 నీటి నమూనాలు తీసుకుని పరీక్షించగా అందులో 44 చోట్ల నత్రజని అధికంగా ఉన్నట్లు తేలింది. అంటే సగటు 62.86 శాతం నీటిలో నత్రజని శాతం పరిమితికి మించి ఉంది. నత్రజని ఆధారిత ఎరువులు, జంతు వ్యర్థాలను ఎక్కువగా వినియోగించే ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొందని పేర్కొంది. తాజా నివేదికలో పెరుగుతున్న జల కాలుష్యం, దానివల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అనేక ప్రాంతాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి క్రమేపీ

మిగతా 7వ పేజీలో...

ఫ్లోరైడ్ మండలాలు

రంగారెడ్డి జిల్లా : మంచాల, యాచారం, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, కేశంపేట, కొందుర్గు, కొత్తూరు.

మేడ్చల్ జిల్లా : బాచుపల్లి, బాలానగర్, దుండిగల్, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, మేడ్చల్

మూడు జిల్లాల్లో నీటి పరీక్షల ఫలితాలు(శాతాల్లో)

	సురక్షితం	పాక్షిక కలుషితం	ప్రమాదకరం	అత్యంత ప్రమాదకరం
రంగారెడ్డి	59.26	22.22	3.7	14.81
మేడ్చల్	33.33	33.33	20	13.33
వికారాబాద్	100	0	0	0

ప్రమాదంలో ఈ మండలాలు

రాజేంద్రనగర్, చౌదరిగూడెం, హయత్‌నగర్, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, ఆల్వాల్, మేడ్చల్, ఘట్‌కేసర్, మూడు చింతలపల్లి, కీసర, మల్కాజిగిరి, బాచుపల్లి మండలాల్లో భూగర్భజలాలు కలుషితమవుతున్నట్లు తేలింది. ఇదిలా ఉంటే భూగర్భజలాల విషయంలో వికారాబాద్ జిల్లా అత్యంత సురక్షితంగా తేలింది. ఇక్కడ 100 శాతం తాగునీరు సురక్షితమని నివేదికలో వెల్లడైంది.

శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటాం

ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఇబ్రహీంపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ పరిధి రాయపోల్ గ్రామంలో కులోన్మాద హత్యకు గురైన కొంగర నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం గ్రామంలో శ్రీకాంత్ అతని తల్లిదండ్రులు హంసమ్మ, సత్తయ్యలను పరామర్శించి ఏసీపీ కేపీవీ రాజు ద్వారా కేసు వివరాలు తెలుసుకున్నారు. కులాంతర వివాహం చేసుకుందని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణిని గతేడాది డిసెంబరు 2న రాయపోల్- మాన్యగూడలో రోడ్డులో సొంత తమ్ముడు పరమేష్ వేట కొడవలితో దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. కాగా పరమేష్‌తోపాటు అతనికి సహకరించిన అచ్చన్న, శివ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. కాగా, ఈ హత్యకు మరికొందరు సహకరించారని, వారిని అరెస్టుచేసి విచారణ జరిపించాలని శ్రీకాంత్ కుటుంబ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ... శ్రీకాంత్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునేలా చూస్తామని ఆయన అన్నారు. వీరికి కేవలం 25 గుంటల భూమి మాత్రమే ఉందని, ప్రభుత్వ పరంగా మరికొంత భూమి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డిని కోరారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల చివరి వారంలో పౌర హక్కుల దినంగా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించాలని తహసీల్దారు సునీతారెడ్డికి సూచించారు. ఈ విషయమై అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతోపాటు పోలీస్ కమిషనర్లకు లేఖ రాయనున్నట్లు ఆయన చెప్పారు.

నిందితులను పోలీస్ కస్టడీకి కోరాం

నాగమణి హత్య కేసులో ఎ-1 గా ఉన్న పరమేష్‌ను పోలీస్ కస్టడీకి తీసుకుని విచారించేందుకు కోర్టులో పిటిషన్ వేశామని ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. న్యాయ సలహా అనంతరం రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు సూచనల మేరకు నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎ-1 పరమేష్, ఎ-2 శివల మధ్య ఫోన్‌పే లావాదేవీలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. అంతేగాక ఈ కేసును త్వరితగతిన విచారించేందుకు స్పెషల్ కోర్టుకు అప్పగించే విషయమై కోర్టుకు నివేదించినట్లు ఆయన చెప్పారు. ఈ పర్యటనలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంట దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ఉన్నారు.

ప్రధానోపాధ్యాయునిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

మహేశ్వరం : తుక్కుగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప స్వాముల ముసుగులో దాడి జరిగి 15 రోజులు కావొస్తున్నా చర్యలు తీసుకోవడంలో పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మండిపడ్డారు. మంగళవారం ఆయన తుక్కుగూడ పాఠశాలను సందర్శించిన బాధిత ప్రధానోపాధ్యాయుడిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డితో మాట్లాడి దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని ఆదేశించారు.



రైతులు, నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ముంతాజ్

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూ సర్వే అడ్డగింత

సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడంపై రైతుల ఆగ్రహం

- రైతుల భూములు దౌర్జన్యంగా లాక్కుంటారా అని నాయకుల ఆక్రోశం
- ఎక్వాయిపల్లిలో సర్వేపై అభ్యంతరం.. నిలిపివేసిన పనులు
- నిబంధనల మేరకే సర్వే చేస్తున్నాం: తహసీల్దార్ ముంతాజ్
- ముద్విన్, ఎక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామ పంచాయతీల వద్ద ఫామ్-సీ నోటిఫికేషన్ ప్రతుల ప్రదర్శన

కడ్తాల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాచారం ఇవ్వకుండా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూ సర్వే పనులు ఎలా చేపడతారని రైతులు, వివిధ పార్టీల నాయకులు అధికారులను నిలదీశారు. ఇందుకోసం పోలీసులను ఎందుకు తీసుకొచ్చారని, దౌర్జన్యంగా రైతుల భూములు లాక్కుంటారా అని మండిపడ్డారు. రైతుల ఆగ్రహాన్ని చూసిన అధికారులు భూ సర్వే పనులు నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. రావిర్యాల ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్ సిటీని కలుపుతూ కందుకూరు, కడ్తాల, ఆమనగల్లు మీదుగా నిర్మించతలపెట్టిన ఆర్‌ఆర్‌ఆర్ వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో భాగంగా కడ్తాల , ముద్విన్ రెవెన్యూ గ్రామాల పరిధిలోని 1727 మంది రైతులకు చెందిన 257.43 ఎకరాల భూసేకరణకు

మిగతా 8వ పేజీలో...

రోడ్డు నిర్మాణం ఆపాలని వినతి

ఆమనగల్లు , జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న పంట పొలాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం పనులు చేయకుండా నిలిపివేయించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 3వ వార్డు సాకిబండ తండా రైతులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. మంగళవారం ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి రైతులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. పాండు, రాజా, రవిరాథోడ్, బాలు, గోపి, నార్య, జైపాల్, దేవేందర్, మహేశ్, మణిపాల్, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'ఇంటిగ్రేటెడ్'



నాలుగేళ్లుగా పూర్తికాని మార్కెట్ నిర్మాణం

- రోడ్లపైనే మాంసం, కూరగాయల విక్రయం
- నిధులు విడుదల కాక నిలిచిన పనులు
- చొరవ చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు
- రూ. 4.50 కోట్లకు రూ. 2.26 కోట్లు విడుదల
- అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఆమనగల్లు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంజూరైన నిధులు సకాలంలో విడుదల కాక ఆమనగల్లు పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పది నెలలుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణం పూర్తికాక కూరగాయల, మాంసం విక్రయాలు పట్టణంలోని అంగడి బజార్‌లో రోడ్లపైనే కొనసాగుతున్నాయి. అసంపూర్తి పనుల పూర్తి విషయంలో ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన నిధులు విడుదల చేసి నిలిచిపోయిన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.4.50 కోట్లు మంజూరు


ఆమనగల్లు పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డ్ నిర్మాణానికి 2021లో రాష్ట్రప్రభుత్వం రూ.4.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. 2021 నవంబర్ 8న మార్కెట్ నిర్మాణానికి అప్పటి

మిగతా 8వ పేజీలో...

రోడ్లపైనే విక్రయాలు

ఆమనగల్లు నాలుగు మండలాలకు ప్రధాన కూడలి. దశాబ్దాలుగా కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలకు నిర్దిష్ట స్థలాలు లేవు. దీంతో మాడ్గుల రోడ్డులో గాంధీచౌక్ నుంచి గ్రంథాలయం వరకు రోడ్లపైనే క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో ఇటు వ్యాపారులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతు బజారు ఏర్పాటు చేయాలని స్థానికులు ఏళ్ల కాలంగా కోరుతుండటంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ సరిపడా నిధులు మంజూరు చేయక నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

త్వరగా పనులు పూర్తి చేయాలి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణం పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ప్రభుత్వం మంజూరు చేసిన నిదుల తో పాటు అవసరమైతే మరిన్నినిదులు కేటాయించాలి. పనులుపూర్తికాక కూరగాయల, మాంసం విక్రయాలు రోడ్లపై కొనసాగిస్తుండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి.

కొమ్ము జెల్లమ్మ, గుర్రంగుట్ట కాలనీ, ఆమనగల్లు

పచ్చదనానికి ప్రాధాన్యం

- గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటడమే లక్ష్యం
- వన మహోత్సవానికి సిద్ధమవుతున్న జీపీలు
- నర్సరీల్లో బెడ్లు సిద్ధం.. విత్తనాలు విత్తిన సిబ్బంది

8





ఎమ్మార్పీఎస్ సమావేశంలో నాయకులు

ఎస్సీ వర్గీకరణ సాధనకు కదలిరావాలి

మంచాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం సాగే అంతిమ లక్ష్యసాధనలో భాగంగా నిర్వహించే హైదరాబాద్ సదస్సుకు లక్ష డప్పులతో కదం తొక్కాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ఆరుట్లలో నిర్వహించిన సదస్సు సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈమేరకు మాదిగ జేఏసీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడిగా కంబాలపల్లి భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరిగితేనే 59 ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. మందకృష్ణ నేతృత్వంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పు ఇచ్చిందన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు కదం తొక్కుతూ.. పాట పాడుతూ డప్పుల దరువులతో తరలిరావాలని పిలుపునిచ్చారు. బండమీది కృష్ణ, పల్నాటి యాదయ్య, చెరుకూరి రవీందర్, ఏర్పుల శ్రీను, జోగు కృష్ణ, అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

చౌదరిగూడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి ఇంగ్లీష్ టాలెంట్ టెస్టులో చౌదరిగూడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నవీన్‌గౌడ్, నక్షత్రలు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జీహెచ్ఎం సునీత తెలిపారు. అలాగే కుంగ్‌ఫూ కరాటే పోటీలో జడ్పీహెచ్ఎస్ చౌదరిగూడ పాఠశాలకు చెందిన శిరీష, రాఘవిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పునరావృతం కానివ్వం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి సంధ్యారాణి

రంగారెడ్డి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'ఇదేం తీరు' అనే శీర్షికపై జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు కొందరు వీల్‌చైర్‌ను ఉపయోగించుకున్నారు. దానిని కార్యాలయంలో అప్పగించకుండా బయటే వదిలి వెళ్లారని చెప్పారు. అదే సమయంలో ప్రీస్కూల్ పిల్లల యూనిఫాంలను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు వచ్చిన కూలీలు తమను సంప్రదించకుండానే ఆ వీల్‌చైర్‌ని ఉపయోగించుకున్నట్లు చెప్పారు. ఇలాంటివి మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటామని ఆమె తెలిపారు.

మక్తాలో విషాధచాయలు

పోలీసుల బందోబస్తు మధ్య లిఖిత అంత్యక్రియలు



ఆత్మహత్యకు కారణమైన మహేశ్(చింటు) ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న లిఖిత బంధువులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంటను వేధింపులకు గురి చేసి వారి ఆత్మహత్యకు కారణమైన యువకుడి ఇంటి ఎదుట బాలిక లిఖిత(17) బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ, మక్తా గ్రామంలో మంగళవారం విషాధచాయలు నెలకొన్నాయి. బాలిక లిఖిత మృతదేహానికి మంగళవారం గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం ముగియాగానే నేరుగా మక్తాలోని ముంత మహేష్ (చింటు) యాదవ్ ఇంటి వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు మక్తా గ్రామానికి చేరుకొని ఆందోళనను విరమించే ప్రయత్నం చేశారు. మృతదేహానికి మహేశ్ ఇంటి ఎదుటే దహన సంస్కారాలు చేస్తామని బాలిక బంధువులు, గ్రామస్తులు భీష్మించారు. బాలిక మృతికి కారణమైన మహేశ్‌ను కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలమని నినాదాలు చేశారు. మృతదేహానికి మహేశ్ ఇంటి అవరణలోనే అంత్యక్రియలు చేసేందుకు కట్టెలు పెట్టి నిప్పంటిస్తుండటంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. మహేశ్ ఇంటిపైకి ఎవరిని రానివ్వకుండ పోలీసులు వారిని బయటకు పంపించారు. మల్కాజిగిరి సీఐ చక్రపాణి, స్థానిక సీఐ రాజువర్మలు బాలిక బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. పోలీసు బందోబస్తు మధ్య లిఖిత అంతిమయాత్ర కొనసాగింది. ప్రేమజంట ఆత్మహత్యకు కారణమైన మహేశ్‌ను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు తెలిపారు.

పీఆర్ రోడ్ల ఆధునీకరణకు రూ.91.51 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ ఆధీనంలోని రహదారుల ఆధునీకరణ, వంతెనల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం రూ.91.51 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి, వెల్దండ, చారగొండ మండలాల పరిధిలో 13 రోడ్లు, 5 వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల సమీక్ష సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పనుల నిర్వాహణకు రూ.1.64 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం రూ.2.11 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామీణ రోడ్ల మరమ్మతు, ఆధునీకరణకు రూ.500 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కోరగా.. ఇప్పటి వరకు రూ.295కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. మాడ్గుల, వెల్దండ మండలాల పరిధిలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.20.43 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. అధికారులు విజయ్‌మార్, బస్వలింగం, షబ్బీర్, మోహన్‌రెడ్డి, స్రవంతి, శ్రావ్య, మణిపాల్, శ్రీనివాస్, శెట్టి, ఏఎంసీ ఛైర్‌పర్సన్లు గీత, మనీలా సంజీవ, నాయకులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, భట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, యాట నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, బీచ్యనాయక్, మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలు కొనసాగిస్తాం



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నిరుపేదల పక్షాన సమరశీల పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని జాపాలలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. యాదయ్య మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా 1925 డిసెంబరు 25న ఆవిర్భవించిన సీపీఐ శతవసంతాలు పూర్తిచేసుకుందని గుర్తుచేశారు. నాయకులు నర్ల శ్రీశైలం, ఎండీ అలీమొద్దీన్, రాజునాయక్, అనంతరెడ్డి, ఎల్.అనంతరెడ్డి, బి.బాలయ్య, మోత్యానాయక్, ఓరుగంటి మల్లయ్య, పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు



తుక్కుగూడలోని హోటల్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ వాణి

మహేశ్వరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని హోటళ్ల పరిశుభ్రత పాటించడంతో పాటు ఆహార పదార్థాల వినియోగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ హోటళ్లలో పరిశుభ్రత పాటించడం, వ్యాపార లైసెన్సులు పొందడం, లేబర్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఫుడ్ లైసెన్స్‌లు లేకుండా హోటళ్ల నిర్వహించరాదని చెప్పారు. నిబంధనలు పాటించని నిర్వాహకులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లు వాడకూడదన్నారు.

పల్లె ప్రగతి పనులకు బిహార్ ప్రతినిధుల బృందం కితాబు



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి సాధించాయని బిహార్ ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం కితాబు ఇచ్చినట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు ఒనగూడిన తీరు బాగుందని వారు ప్రశంసించినట్లు చెప్పారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థలో 4 రోజుల శిక్షణ కార్యక్రమానికి బిహార్ బ్లాక్‌స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం హాజరైంది. శిక్షణ కార్యక్రమంలో ఎన్ఐఆర్డీపీఆర్ రిసోర్స్ పర్సన్‌గా లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పల్లె ప్రకృతివనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, హరితహారం మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తదితర విషయాలపై బృందానికి వివరించినట్లు తెలిపారు. బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మూడుచింతలపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మెడికల్ షాపులపై 'మెడికల్ దందా!' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని ఉద్దెమర్రి, మూడుచింతలపల్లి గ్రామాల్లోని బాలాజీ, సాయికృష్ణ, శ్రీ వెంకటేశ్వర మెడికల్ షాపుల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

రైతు సహకార సంఘం పనితీరు భేష్



శామీర్‌పేట రైతు సహకార సంఘం కార్యాలయంలో ఒరిస్సా అధికారుల బృందానికి వివరిస్తున్న చైర్మన్ మధుకర్‌రెడ్డి

శామీర్‌పేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట రైతు సహకార సంఘాన్ని మంగళవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన కోఆపరేటివ్ శాఖ ఉన్నతాధికారుల బృందం సందర్శించింది. అధికారుల బృందానికి రైతు సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మ్యాకల ఐలయ్య, డైరెక్టర్లు స్వాగతం పలుకుతూ సంఘం సాధించిన అభివృద్ధి పనులను వివరించారు. సహకార సంఘం అభివృద్ధి బాగుందని, పనితీరు భేషుగ్గా ఉందని అధికారుల బృందం అభినందించింది. ఒడిశా రాష్ట్ర కోఆపరేటివ్ శాఖకు చెందిన 22మంది ఉన్నతాధికారులు శామీర్‌పేట రైతు సహకార సంఘానికి విచ్చేసి సెక్షన్ల వారీగా పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాన్ని నష్టాల నుంచి అభివృద్ధి పథంలోకి ఎలా తీసుకవచ్చారని, ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందని ఆ సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డిని అధికారుల బృందం స్పష్టంగా అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సంఘం నుంచి రైతులకు చేయూత, రైతులకు కావల్సిన సౌకర్యాల కల్పన చాలా బాగుందని ఒరిస్సా అధికారుల బృందం చైర్మన్ మధుకర్‌రెడ్డిని అభినందించారు. ఇలాంటి సహకార సంఘాలు ఉంటే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని కితాబిచ్చారు.

ఉద్యమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం!



కుర్మిద్దలో ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమకారుల ర్యాలీ (ఫైల్)



సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

"ఫ్యూచర్‌సిటీ రోడ్డుకు భూసేకరణ చేయవద్దని, దానిని రద్దుచేయాలని ర్యాలీలు, సభలు సమావేశాలు పెట్టుకోవావాలంటే విధిగా అనుమతి పొందాలి. లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదు.

- లిక్కి కృష్ణంరాజు, సీఐ, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ

▸▸ సభలు, ర్యాలీలపై పోలీసుల నజర్

▸▸ ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలపై గుర్రు

యాచారం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఉద్యమాలు, ఫ్యూచర్ సిటీకి సంబంధించిన రోడ్డుకు భూ సేకరణ చేయవద్దని ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టవద్దని, అనుమతి తీసుకొని మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలని హెచ్చరికలు చేస్తోంది. మండలంలోని కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో ఆందోళన కారులు ఇటీవల బాధితులు ర్యాలీలు నిర్వహించారు. ఈమేరకు పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులతో పాటు సీఎంవో అధికారులు అప్రమత్తమయ్యారు. దాంతో సభలు, ర్యాలీలు, సమావేశాలు పెట్టాలంటే ముందుగా పోలీస్ కమిషనరేట్ నుంచి విధిగా అనుమతి తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దాంతో ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమంపై రాచకొండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాము అధికారంలోకి వస్తే.. కొత్తగా భూసేకరణ చేయమని, ఫార్మాసిటీ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు.. నేడు మాట తప్పుతున్నారని ఆందోళనకారులు మండిపడుతున్నారు. ఫ్యూచర్ సిటీ రోడ్డు కోసం యాచారం మండలంలోని కుర్మిద్దలో 529మంది రైతులకు చెందిన పట్టా, ప్రభుత్వ భూములను 144ఎకరాల 7గుంటలు సేకరించడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం మళ్లీ భూసేకరణ చేస్తే.. 529 మంది రైతులు వీధిన పడతారు. వారంతా ఎకరం, అరెకరం భూములున్న నిరుపేద రైతులే. ఫార్మాసిటీ కొరకు 19,333ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ప్రభుత్వ, అసైన్డ్ భూములు 4 వేల ఎకరాలు సేకరించారు. పట్టాభూములు 6 వేల ఎకరాలకు గాను నాలుగు వేల ఎకరాల భూములు సేకరించారు. మరో 2 వేల ఎకరాల భూములపై కోర్టు కేసులు నడుస్తున్నాయి. మరో 1,994 ఎకరాల 28 గుంటల భూమిని గతప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేసి క్రయ విక్రయాలు జరుపుకునేట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆందోళన కారులు డిమాండ్ చేస్తున్నారు.

అయితే, ఆ భూములను ఎందుకోసం తీసుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమాన్ని నీరు గార్చడానికి పోలీస్ యంత్రాంగం ఎన్ని ప్రయత్నాలు చేసినా భయపడేది లేదని, శాంతియుతంగా ఉద్యమాలు చేయడానికి వెనుకాడే ప్రసక్తే లేదని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తేల్చి చెబుతున్నారు. ఫార్మాసిటీని రద్దుచేసి నిషేధిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసేదాకా పోరాటం ఆపేదిలేదని ఆందోళన కారులు చెబుతున్నారు.

నేటి నుంచి 'ఎమ్మెల్యే బీఎంఆర్ కప్' పోటీలు

తాండూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. 'ఎమ్మెల్యే బీఎంఆర్ కప్' పేరిట నేటి(బుధవారం) నుంచి 11వ తేదీ వరకు టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో తాండూరు పట్టణంతో పాటు యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, తాండూరు మండలాల పాఠశాలల విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈపోటీలను తాండూరు పట్టణం గౌతమి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీలను నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు సెల్‌నంబర్ 9701586893(పీడీ అనంతయ్య), 9951197417 (పిడి గోపాల్)లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. బాలికలకు ప్రత్యేకంగా త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

పాఠశాలలో నాగుపాము కలకలం



దోమ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బడెంపల్లి ఉన్నత పాఠశాలలో నాగుపాము కలకలం రేపింది. పాఠశాల చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండటంతో పాఠశాలలోకి నాగుపాము చొరబడింది. గమనించిన ఉపాధ్యాయులు అప్రమత్తమయ్యారు. పాములు పట్టే వ్యక్తిని పిలిపించి పామును పట్టించి బహిరంగ ప్రదేశంలో వదిలేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం రూ.కోటీ 50లక్షల కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ 136 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.1,36,15,776కోట్లు, 30 మందికి రూ.13,93,500లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత పాలకుల నిర్వాకం వల్ల ప్రభుత్వం నిధుల కొరతను ఎదుర్కొంటున్నా.. ఏ సంక్షేమ పథకాన్నీ ఆపకుండా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రజలు వచ్చి సమస్యలు తెలిపితే పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం టీ, టిఫిన్లు, భోజన వసతిని సైతం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసి, పారదర్శంగా ముందుకు సాగుతుంటే.. కొందరు మీడియా ముసుగులో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అసత్య ప్రచారం చేస్తే సహించేదిలేదని శంకర్ హెచ్చరించారు.



మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఇంటర్ విద్యార్థులకు ఉచిత భోజనం

షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సైతం ఆకలితో అలమటించకుండా మూడు నెలల పాటు భోజనాన్ని అందిస్తామని తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు ఎ.కృష్ణారెడ్డి, చిట్టెం దామోదర్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, జి.బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్, నర్సింహయాదవ్, కె.సూర్యప్రకాష్, కె.చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల అభివృద్ధికి అదనపు నిధులివ్వండి

షాద్‌నగర్, కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రుల భవన నిర్మాణాలు పూర్తి చేయడానికి అదనపు నిధులివ్వాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చి అదనపు నిధులివ్వాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. షాద్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేయడానికి రూ.5కోట్ల 31 లక్షలు, కేశంపేటలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేయడానికి రూ.22లక్షల 80 వేలు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందించారని, అదనపు నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

జైపాల్ రెడ్డికి అరుదైన గౌరవం.. కాంగ్రెస్ నేతల సంబురాలు

▸▸ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

▸▸ ఆమనగల్లులో కాంగ్రెస్ నేతల ర్యాలీ

ఆమనగల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి పేరు నామకరణం చేయాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ఆమనగల్లు పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. రాజీవ్ చౌక్‌వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు ఎంఏ ఖలీల్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యనాయక్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కాంగ్రెస్, రేవంత్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ పాతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దివంగత సూదిని జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం హర్షదాయకమన్నారు. జైపాల్ రెడ్డి ఐదు దశాబ్దాల పాటు జాతీయ స్థాయిలో అందించిన సేవలకు అసలైన నివాళి అని కొనియాడారు. పాలమూరు బిడ్డ , నిస్వార్థ సేవా పరుడు జైపాల్ రెడ్డి సేవలను ప్రభుత్వం గుర్తించి భావితరాలు గుర్తుంచుకునేలా ఎత్తిపోతల పథకానికి పేరు పెట్టాలని నిర్ణయించడం గర్వకారణమన్నారు. మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, నాయకులు కాలె మల్లయ్య, ఎంగళి ప్రసాద్, ఎంఏ అలీం, ఖాదర్ ఖాద్రీ, ఖాదర్, జవహర్‌లాల్ నాయక్, శంకర్, రాజశేఖర్, బాబా, సురేశ్, కండె సాయి, ఫరీద్, మైసయ్య, నాజర్,మహేశ్, సురేశ్, మల్లేశ్‌నాయక్, కృష్ణయ్య, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

భూగర్భం.. గరళం

(5వ పేజీ తరువాయి)

పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది సురక్షిత భూగర్భజలాలు ఉన్న పలు మండలాల్లో భూగర్భజలం ప్రమాదకరంగా మారింది. రుతుపవనాలకు ముందు సేకరించిన నీటి నమూనాల్లో కంటే వర్షాలు పడిన తర్వాత తీసుకున్న వాటిల్లో ఫ్లోరైడ్ శాతం తక్కువగా ఉండడం గమనార్హం.

బోరు నీటితో జాగ్రత్త తప్పనిసరి

వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో సోడియం కార్బొనేట్ అధిక శాతం ఉంది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లాలో 27 చోట్ల నమూనాలు తీసుకుని పరీక్షలు నిర్వహించగా ఇందులో 16 చోట్ల అంటే 59.26 శాతం తాగునీరు సురక్షితమని తేలింది. మిగతా చోట్ల భూగర్భజలాలు అంత సురక్షితం కాదని వెల్లడైంది. ఇందులో 14.81 శాతం నమూనాల్లో భూగర్భజలం అత్యంత ప్రమాదకరంగా ఉందని తేలింది. ఉమ్మడి జిల్లాల్లో అత్యధిక శాతం ప్రజలు ప్రభుత్వం సరఫరా చేస్తున్న శుద్ధ జలాలు, ఆర్వో ప్లాంట్ల నీటిని తాగుతున్నప్పటికీ ఇంకా కొన్ని మారుమూల ప్రాంతాల్లో బోరు నీటిని తాగేందుకు ఉపయోగిస్తున్నారు. బోరు నీటిని తాగే ప్రజలు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదకర జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది.

ఎంత దాటితే ప్రమాదకరం?

వాస్తవానికి లీటరు జలంలో 1.50 మిల్లీ గ్రాములకు మించి ఫ్లోరైడ్ ఉంటే ఈ నీరు సురక్షితం కాదు. అలాగే 45 మిల్లీ గ్రాములకు మించి నత్రజని, 1.50 మిల్లీ గ్రాములకు మించి సోడియం కార్బొనేట్ ఉంటే పరిమితికి మించి ఉంటే ఆ నీరు తాగడానికి పనికి రాదు. ఉమ్మడి జిల్లాల్లో పలు చోట్ల సేకరించిన నమూనాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్, సోడియం కార్బొనేట్ పరిమితికి మించి పరీక్షల్లో తేలింది. భూగర్భ జలాలను ఎక్కువగా వినియోగిస్తున్న ప్రాంతాల్లో ఫ్లోరైడ్ పెరుగుతోంది. ఈ నీరు తాగిన వారు ఫ్లోరోసిస్ వ్యాధికి గురవుతుంటారు. అలాగే భూగర్భజలాల్లో నత్రజని అధిక శాతంలో ఉండడం వల్ల కూడా ఆ నీరు సురక్షితం కాదు. పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతుండడం వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. జిల్లాల్లో సేకరించిన నమూనాల్లో పలు చోట్ల సోడియం కార్బొనేట్ పరిమితికి మించి ఉన్నట్లు తాజా నివేదిక స్పష్టం చేసింది. ఇది పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు.

వైభవంగా మైసమ్మ పండుగ



వేడుకల్లో గ్రామస్తులు

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గొట్టిముక్లలో మంగళవారం మైసమ్మ పండుగ వైభవంగా నిర్వహించారు. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒక సారి మైసమ్మ పండుగను ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పుచప్పుళ్ల మధ్య జోగినితో బోనం తీయించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మైసమ్మ ఆలయం వద్ద మాతంగి గ్రామ భవిష్యవాణి వినిపించారు. పోతురాజుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు మాణిక్యరెడ్డి, సాయన్న, లాలయ్య, గోపాల్, బాల్‌రాజ్, మల్లేశ్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

మహేశ్వరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నియమ నిబంధనలు పాటించకుండా మహేశ్వరంలో అక్రమంగా వెలుస్తున్న రియల్ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణాధ్యక్షుడు బంగరిగల్ల లాజర్ అన్నారు. అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్, ఎంపీవోలకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహేశ్వరం రెవెన్యూలోని సర్వేనెంబర్లు 350, 375లలో వ్యవసాయ భూమిని ఎలాంటి కన్వర్షన్ చేయకుండా ప్లాట్లుగా తయారు చేసి అడ్డగోలుగా విక్రయిస్తున్నారన్నారు. దాంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు చెల్లించాలి

చౌదరిగూడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ పిలుపు మేరకు కొందుర్గు మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. అంగన్వాడీ టీచర్లకు కనీస వేతన చట్టం ప్రకారం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గ్యాస్, కూరగాయల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు నరసింహ, అంగన్వాడీ టీచర్లు యామిని, సువర్ణ, మానెమ్మ, శ్రీలత, ప్రమీల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిపై ఫిర్యాదు




మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, కౌన్సిలర్ సోమ శేఖర్

తాండూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్ లాలపై మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదును ఏఎస్ఐకి అందజేశారు. హబీబ్ లాల సోమవారం సాయంత్రం తనను దుర్భాషలాడటంతో పాటు దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే విధులకు ఆటంకం కలిగించడం కాకుండా దుర్భాషలాడినందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సమ్మెకు కౌన్సిలర్ సోమశేఖర్ మద్దతు ఇచ్చారు. మధ్యాహ్నం భోజన విరామం సమయంలో మున్సిపల్ ఉద్యోగులు యూనియన్ నాయకులతో కలిసి నల్లా బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి కౌన్సిలర్ సోమశేఖర్ తీసుకెళ్లారు.

అంబేడ్కర్ విగ్రహం తరలింపునకు చర్చలు

అంబేడ్కర్ సంఘం నేతలతో పోలీసుల భేటీ



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్ రెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారికి ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మరో చోటుకు తరలించటానికి పోలీసులు అంబేడ్కర్ సంఘం నాయకులతో మంగళవారం చర్చలు జరిపారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జాతీయ రహదారి వంతెన నిర్మాణపు పనుల్లో భాగంగా రోడ్డు సమీపంలోని పలు కట్టడాలను తొలగిస్తున్నామని వివరించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పట్టణ ప్రధాన కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తరలించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సివస్తుందని తెలిపారు. విగ్రహాన్ని పట్టణంలో ఎక్కడ ఆవిష్కరించాలన్న విషయమై సంఘం నేతల అభిప్రాయాన్ని కోరగా వారు సమ్మతించారు. విగ్రహం ఆవిష్కరించే ప్రదేశాన్ని కేటాయించి పూర్తి ఏర్పాట్లు చేసిన అనంతరం విగ్రహాన్ని తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, హనుమాన్ గౌడ్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



డ్రైనేజీ పనులను పరిశీలించిన నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో రూ.75 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని తెలిపారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలైన తాగునీరు, వీధిదీపాల నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధికి సహకరించాలి

మహేశ్వరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేకుండా మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని, ప్రతీఒక్కరు సహకరించాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత రాజు అన్నారు. మంగళవారం పలు వార్డుల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న హేమలత

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

ఆమనగల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన మెండే శ్రీనుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.60వేలు మంజూరయ్యాయి. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి బాధిత కుటుంబానికి ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డితో కలిసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఖర్చులు పేదలకు భారం కాకూడదని ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విరివిగా సాయమందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనానికి ప్రాధాన్యం

- గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటడమే లక్ష్యం
- వన మహోత్సవానికి సిద్ధమవుతున్న జీపీలు
- నర్సరీల్లో బెడ్లు సిద్ధం.. విత్తనాలు విత్తిన సిబ్బంది



చేవెళ్ల మండల కేంద్రంలోని నర్సరీలో కలుపు తీస్తున్న కూలీలు



కవర్లలో మట్టిని నింపుతున్న సిబ్బంది

చేవెళ్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పచ్చదనమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవానికి గ్రామ పంచాయతీలు సిద్ధమవుతున్నాయి. వర్షాకాలం వచ్చేలోగా నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా చేవెళ్ల డివిజన్ పరిధిలోని 132 గ్రామ పంచాయతీల్లో కవర్ బ్యాగులను తయారు చేసి మట్టిని నింపి బెడ్డుగా పేర్చి విత్తనాలను విత్తారు. పండ్లు, పూల రకాలతో పాటు బహువీనియా, మందార, మునగ, ఉసిరి, తంగేడు, ఈత, మోదుగ, కరివేపాకు, చింత, ఇప్ప, పూనుగ, సీతాఫలం, జామతో పాటు వివిధ ఇతర రకాల మొక్కల విత్తనాలను నాటారు.

జీపీకి 10 వేల మొక్కలు..

వన మహోత్సవంలో భాగంగా ఈ సంవత్సరం ప్రతీ గ్రామ పంచాయతీలో పది వేల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో పదివేల మొక్కలు పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అందుకు అనుగుణంగా బెడ్లను తయారు చేసి మొక్కలను పెంచేందుకు సిద్ధమయ్యారు.

అన్ని నర్సరీల్లో విత్తనాలు నాటాం



చేవెళ్ల మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో పది వేల చొప్పున మొక్కలు పెంచేందుకుగాను నర్సరీల్లో విత్తనాలు నాటాం. మొక్కలు పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ మొక్కను కాపాడతాం. వన మహోత్సవం నాటికి నర్సరీల్లో అన్ని మొక్కలను అందుబాటులో ఉంచుతాం.

- విఠలేశ్వర్, చేవెళ్ల, ఎంపీవో

అసంపూర్తిగా 'ఇంటిగ్రేటెడ్'

(5వ పేజీ తరువాయి)

మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి, అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లు శంకుస్థాపన చేశారు. కాగా నెలలు గడిచినా పనులు ప్రారంభించలేదు. స్థానికుల ఒత్తిడి మేరకు 2023లో పనులు ప్రారంభించి స్లాబ్‌ల వరకు నిర్మాణం పనులు చేపట్టారు. కాగా నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ 10 నెలల క్రితం పనులు నిలిపివేశారు.

విడుదల కాని నిధులు

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.4.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ రూ.3.30 కోట్ల పనులు చేపట్టారు. కాగా చేపట్టిన పనులకు సంబంధించి రూ.2.26 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.1.04 కోట్లు బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు తెలిసింది. నెలల కాలంగా పనులు నిలిచిపోయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ చుట్టు పిచ్చి మొక్కలు పెరిగి కళావిహీనంగా మారింది.

ప్రభుత్వానికి నివేదించాం



ఇంటిగ్రేటెడ్ నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారులకు సైతం నివేదించాం. మంజూరైన రూ.4.50 కోట్లకు అదనంగా మరో రూ.1.49 కోట్లు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. చేసిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన రూ.1.04 కోట్ల బిల్లు అందించి నిధులు కేటాయించిన వెంటనే పనులు చేపట్టి వినియోగంలోకి తెస్తాం. పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు కూడా సూచించాం.

- వసంత, కమిషనర్, ఆమనగల్లు మున్సిపల్

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యాచారం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధి మంతన్‌గౌరెల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వైర్ల కింద చెట్ల నరికివేత, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంతన్‌గౌరెల్లి, నిమ్మకుంటలో సరఫరా ఉండదన్నారు.

ఆదిభట్ల పరిధిలో..

ఆదిభట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్లలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, వైర్లకింద చెట్ల నరికివేత పనులు చేపడుతున్న నేపథ్యంలో నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కప్పాడులో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని అధికారులు తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూ సర్వే అడ్డగింత

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రాథమిక నిర్ధారణ చేసి నోటిఫికేషన్ విడుదల చేసింది. అందుకనుగుణంగా ఎక్వాయిపల్లి వద్ద ఓ ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకులు సర్వే ప్రారంభానికి ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న గ్రామ రైతులు స్థానిక బీఆర్ఎస్ నేత జోగు వీరయ్యతో కలిసి సర్వే చేపడుతున్న బృందం వద్దకు వెళ్లారు. సమాచారం ఇవ్వకుండ సర్వే ఎలా చేస్తున్నారని అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, సీఐ శివప్రసాద్ ఎక్వాయిపల్లికి చేరుకున్నారు. నిబంధనల మేరకే సర్వే పనులు చేపడుతున్నామని రైతులు, నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కనీసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నోటిఫికేషన్ ప్రదర్శించకుండా సర్వే ఎలా చేస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్విన్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఫామ్-సీ నోటిఫికేషన్‌ను ప్రదర్శించామని, దిన పత్రికలో కూడా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని తహసీల్దార్ వివరించారు. తమకు పూర్తిస్థాయి సమాచారం ఇచ్చాకే భూసర్వే చేపట్టాలని రైతులు, నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎక్వాయిపల్లి, మద్రిపల్లి గ్రామ పంచాయతీల వద్ద భూ సేకరణకు సంబంధించి ఫారం-సీ నోటిఫికేషన్ ప్రతులను అధికారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగు వీరయ్య, నాయకులు కరుణాకర్, జంగం శంకరయ్య, చంద్రయ్య, నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చెన్నయ్య, సుమన్, జంగయ్య, బాలగోనినారాయణ, నర్సింహ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లిలో భూసర్వే, మార్కింగ్ పనులు కొనసాగాయి. సీఐ శివప్రసాద్, ఎస్సై వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతు సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



సమావేశంలో నాయకులు

మంచాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు ఎడమ రాంరెడ్డి అన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ సమావేశం మంగళవారం మంచాలలో జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన రైతులు.. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై మండల కమిటీకి వినతిపత్రం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రామస్థాయిలో కమిటీలను బలోపేతం చేయడం ద్వారా క్షేత్రస్థాయి సమ్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యుత్ సమస్యపై ట్రాన్స్‌కో అధికారులను కలవాలని సమావేశంలో తీర్మానించారు. పాలధరలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కిసాన్ సంఘ్ మండల కార్యదర్శి దండు మధుసూధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్, కె.శంకర్, రామచంద్రయ్య, సీహెచ్.శ్రీ శైలం, సీ.శ్రీనివాస్, మాధవరెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : సీఐ



చేవెళ్ల : మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



షాద్‌నగర్ రూరల్ : అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్, ఎంవీఐ వాసు

చేవెళ్ల/షాద్‌నగర్‌రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తగా తీసుకోవాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, చేవెళ్ల పోలీస్ స్టేషన్ సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, విద్యార్థులు, టీచర్లు తదితరులు ఉన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ హైవేలో తరచూ ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, పరిమితికి మించి వేగంగా వాహనాలు నడపవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



జెర్సీలను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చౌదరిగూడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో కేపీఎల్-5 క్రికెట్ క్రీడాకారుల జెర్సీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గ్రామీణ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాగే బుధవారం కొందుర్గులో ప్రారంభం కానున్న కేపీఎల్ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొండా విజయ్‌కుమార్‌లు హాజరుకానున్నట్లు కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ తెలిపారు. నాయకులు గోపాల్, జగదీశ్వర్ గౌడ్, రాఘవేందర్‌గౌడ్, సాయి, నవీన్, సచిన్ ఆర్గనైజింగ్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కడ్తాల్** : పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు పెద్ద పీట వేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ కార్యదర్శి బొప్పిడి గోపాల్‌లు అన్నారు. రావిచెడ్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీలు ప్రియరమేశ్, బొప్పిడి గోపాల్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్‌లతో కలిసి దశరథ్ నాయక్ ప్రారంభించారు. డాక్టర్ ఉప్పల అఖిల్ ఆధ్వర్యంలోని కామినేని ఆసుపత్రి వైద్య బృందం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.
- **షాద్‌నగర్ రూరల్** : విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నిర్మూలించేందుకు కృషి చేయాలని ఎన్ఆర్ఐ, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఆలోక్ అగర్వాల్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ పరిధిలోని ఆశాలకు పోషకాహారలోపం నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి శంకర్, మేనేజర్ మురళీకృష్ణ, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.
- **కడ్తాల్** : తెలంగాణ పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డిని జిల్లా పశుపోషకుల సంఘం అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పెండింగ్ పాల బిల్లులను విడుదల చేయాలని, సబ్సిడీ దాణాను సక్రమంగా అందించాలని, అన్ని పాలశీతలీకరణ కేంద్రాలలో టిప్ కమిటీలను పునరుద్ధరించాలని, పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందించాలని, కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం ఎదుట నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని ప్రారంభించాలని, కేంద్రానికి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. దాంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెన్నకిషన్‌రెడ్డి తెలిపారు.
- **మంచాల** : ఆరుట్ల గ్రామాభివృద్ధిపై సంబంధిత యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్, సీపీఎం, డీఎస్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. పున్నం రాము, బైకని మహేందర్, లాలగారి జంగయ్య, బుగ్గరాములు, తదితరులున్నారు.
- **కడ్తాల్** : ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిధూరి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కడ్తాల మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బోసు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, తాలుకా ఉపాధ్యక్షుడు షాబోద్దీన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. యువజన కాంగ్రెస్ జెండాలు చేబూని నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో రమేశ్ బిధూరి దిష్టిబొమ్మను దహనం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ విఫలం

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి

చౌదరిగూడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. మంగళవారం ఆయన చౌదరిగూడలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రజా రోదనగా మారిందని, సంక్షేమ పథకాల వైపు నుంచి ప్రజల దృష్టిని మరలించేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్త నాటకాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే ఆరెస్టుచేసి క్షమాపణ చెప్పాలని, లేనియెడల కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఆయన అన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి హేయం


షాబాద్/కేశంపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం దాడిచేసి రాళ్లు రువ్వడం హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన వారిని వెంటనే ఆరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ సీనియర్ నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య విలువల్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఇలాంటి దాడులకు పాల్పడడం రౌడీయిజాన్ని తలపిస్తోందన్నారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నర్సింహ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని ఖండిస్తున్నామని అన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

ఎమ్మెల్యే 'క్యాంపు ఆఫీసు'పై తప్పుడు ప్రచారం తగదు

● కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుపై తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తప్పవని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రఘునాయక్‌లు మాట్లాడారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ప్రతీ రోజు ఉదయం ఎమ్మెల్యేను ప్రజలు కలిసి, తమ సమస్యలను వివరిస్తున్నారని, వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తూ, పారదర్శకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైతం ఎమ్మెల్యే అడుగు జాడల్లో నడుస్తూ ప్రజా సేవకు కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ఉన్నప్పుడు విలేకరులు సైతం వచ్చి, కార్యక్రమాలు ముగియగానే వెళ్తున్నారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం టీ, పండ్లు, టిఫిన్స్, భోజనాలకు ఎమ్మెల్యే తన వేతనాన్ని కేటాయించారని అన్నారు. అయితే, కొందరు జర్నలిస్టులు నిత్యం క్యాంపు ఆఫీసులో తిష్టవేసి, ఎమ్మెల్యేకు, సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కల్గిస్తున్నారని, జర్నలిజం ముసుగులో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యాంపు ఆఫీసుకు రాకుండా, ఇక్కడి వ్యవహారాలను చూడకుండా జర్నలిస్టులు కానివారు.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇకముందు వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులు చెంది తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనునాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న దీనావన్‌రావు

యాచారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు అండగా ఉండాలని రంగారెడ్డి జిల్లా శ్రీసత్యసాయిబాబా సేవాసమితి అధ్యక్షుడు దీనావన్‌రావ్ అన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న అభాగ్యులు, నిరుపేదలకు సేవ చేయాలని, దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకోవాలని తరచూ సత్యసాయిబాబా అనేవారని ఆ యన ఆశయసాధనకు మనమంతా కృషి చేయాలన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో 30 మంది దివ్యాంగులకు వారు కుట్టు మిషన్లు, రగ్గులు, వీల్‌చైర్‌లు, ట్రైసైకిళ్లు అందించారు. భోజనవసతి కల్పించిన తహసీల్దారు అయ్యప్పకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీసత్యసాయి బాబా సేవా సమితి సభ్యులున్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య

ఆదిభట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భర్తను భార్య చంపిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలానికి చెందిన అంకుల షణ్ముఖరావు(51), భార్య ఉమాపతితో కలిసి తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ గ్రామంలో 6 నెలల నుంచి అద్దెకు ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే షణ్ముఖరావు మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా నిత్యం భార్యను వేధించేవాడు. సోమవారం రాత్రి సైతం ఇద్దరు మద్యం సేవించి గొడవ పడ్డారు. మద్యం మైకంలో భర్తను భార్య విచక్షణారహితంగా కొట్టడంతో అతను అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి యజమాని వచ్చి తలుపు కొట్టగా తలుపులు తీయలేదు. అనుమానం వచ్చి తలుపులను పగలకొట్టి చూడగా షణ్ముఖరావు గదిలో రక్తం మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సై రాజు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లోనే ఉన్న భార్యను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇంటి యజమాని శ్రీనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

శంషాబాద్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు..జ మండల పరిధి పెద్దగోల్కొండకు చెందిన దూడల సాయిలుగౌడ్(55) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 3న మద్యం సేవించి ఇంటికొచ్చాడు. దాంతో ఆయన కుమారుడు అరుణ్‌కుమార్‌గౌడ్ తండ్రిని మందలించాడు. మధ్యాహ్నం 3 గంటలకు ఎవరికీ చెప్పకుండా సాయిలుగౌడ్‌ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి

కేశంపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో వారం క్రితం అదృశ్యమైన వృద్ధుడు కందాడ కృష్ణయ్య(62) బావిలో పడి మృతిచెందినట్లు సీఐ నరహరి తెలిపారు. మంగళవారం గ్రామ సమీపంలోని పాడుబడిన బావిలో శవం తేలి ఉండటాన్ని గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి శవాన్ని బయటకు తీయగా.. కృష్ణయ్యగా గ్రామస్థులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. వృద్ధుడు జనవరి 1న ఇంటి నుంచి వెళ్లాడని మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై రాజ్‌కుమార్ మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైద్యం వికటించి పెంపుడు పిల్లి మృతి!

● పశువైద్యులపై బాధితురాలి ఫిర్యాదు

చేవెళ్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అర్హత లేకున్నా పెంపుడు పిల్లికి వచ్చీరాని చికిత్స చేశారు. దాంతో వైద్యం వికటించి ఆ పిల్లి మృతిచెందింది. ఈమేరకు సరైన వైద్యం చేయని ప్రభుత్వ పశువైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పిల్లిని పెంచుకున్న మహిళ పోలీస్‌లకు ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం చేవెళ్లలో చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని అల్లవాడ గ్రామానికి చెందిన పౌజియాబేగం కుటుంబం ఏడాదికాలంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని చంద్రారెడ్డినగర్ కాలనీలో అద్దె కుంటున్నారు. పౌజియాబేగం ఐదు నెలల వయస్సున్న పిల్లిని పెంచుకుంటోంది. నాలుగైదు రోజుల నుంచి పిల్లి ఎలాంటి ఆహారం తీసుకోవడం లేదు. జ్వరం ఉందని మంగళవారం మధ్యాహ్నం చేవెళ్లలోని ప్రభుత్వ పశువైద్యశాలకు పిల్లిని తీసుకెళ్లింది. విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఆఫీస్ సబార్డినేట్ దేవేందర్ నట్టల జ్వరం మందును పిల్లికి ఇచ్చాడు. రెండు గంటల తర్వాత పిల్లి సొల్లు కారుస్తూ వణుకుతోందని పౌజియాబేగం మళ్లీ ఆసుపత్రికి వచ్చింది. దాంతో విధుల్లో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ హేమ, గోపి, ఓఎస్ ఖలీల్ ఆ పిల్లికి ఎవిల్ ఇంజక్షన్‌తో పాటు నార్మల్ సెలైన్ ఎక్కించారు. దాంతో పిల్లికి నయమైందని అనుకున్నారు. 2 గంటల తర్వాత పిల్లి మృతిచెందింది. పశువైద్యుల నిర్లక్ష్యంతోనే పిల్లి మృతి చెందిందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

యాచారం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు నిలిపిన ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురైన ఘటన హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊట్లపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెన్నయ్య, అశోక్, భిక్షపతి, వినోద్‌నాయక్‌లు తమ ట్రాక్టర్లను ఇళ్ల ముందు నిలపగా.. గుర్తుతెలియని దుండగులు 4 ట్రాక్టర్ల బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.